Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 146 | హైదరాబాద్ | శనివారం 18 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## నేనే స్వయంగా పాక్ వెళ్తా!

త్వరలో శాంతి ఒప్పందానికి అవకాశం

అమెరికా, ఇరాన్ మధ్య చర్చల్లో పాక్‌ది కీలకపాత్ర

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 17: పశ్చిమాసియాలో యుద్ధం త్వరలోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు ఒకవైపు.. ఇటు ఇరాన్‌ను మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తామని ఆయన యంత్రాంగం మరోవైపు ప్రపంచాన్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరితే తాను పాకిస్తాన్ పర్యటనకు వెళ్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో రెండు నెలలే యుద్ధం చేశామని పేర్కొన్నారు. ఇరాన్‌తో సంబంధం ఉన్న నౌకలను టార్గెట్ చేస్తామని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్‌కైన్ హెచ్చరించారు. ఇరాన్‌తో జరుగుతున్న చర్చల పట్ల ట్రంప్ సానుకూలత

- మిగతా 2వ పేజీలో



కొందరు మంత్రులు 'మేం మోనార్క్‌లం.. ? ఎవరి మాట వినం' అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు సొంత పార్టీ ఎమ్మెల్యేలే అంటున్నారు. కొందరు ఎమ్మెల్యేలు మంత్రుల తీరుపై లోలోన మదన పడుతుండగా, మరికొందరు బహిరంగంగానే మంత్రులపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతా ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు ప్రవర్తిస్తున్నారట. ప్రతిపక్ష నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తుంటే సీనియర్ మంత్రులు కూడా సైలెంట్‌గా ఉంటున్నారట. ఏదైనా పనిమీద ఎమ్మెల్యేలు.. మంత్రుల దగ్గరకు వెళ్తే గంటల తరబడి వెయిట్ చేయిస్తున్నారట.

# మంత్రులు.. మోనార్క్‌!

## ఎవరి మాటా వినరు.. ఎమ్మెల్యేలంటే లెక్కేలేదు..

పేషీకి వెళ్తే గంటల తరబడి నిరీక్షణ.. ఫోన్ లిఫ్ట్ చేసే పరిస్థితి ఉండదు..

బహిరంగంగానే ఆరోపిస్తున్న కొందరు.. ఆరోపణలు వస్తే లోలోన సంతోషం?

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు ప్రతినిధి)

ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో మంత్రుల తీరు విమర్శల పాలవుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తనదైన మార్క్‌తో ముందుకు సాగుతుండగా, కొందరు మంత్రులు 'మేం మోనార్క్‌లం.. ఎవరి మాట వినం' అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు సొంత పార్టీ ఎమ్మెల్యేలే అంటున్నారు. కొందరు ఎమ్మెల్యేలు మంత్రుల తీరుపై లోలోన మదన పడుతుండగా, మరి కొందరు బహిరంగంగానే మంత్రులపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. మంత్రులంతా తమకు తామే సుప్రీమ్ అని..తమకు ఎవరితో ఏ అవసరం అనే భావనలో ఉన్నారని, కనీసం తమను పట్టించుకునే మంత్రే లేకుండా పోయారని అధికార పార్టీలోనే ఎమ్మెల్యేలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎవరినీ పట్టించుకోరు..

ప్రజాప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు మంత్రులు పార్టీని, ప్రభుత్వాన్ని పట్టించుకోవడం లేదని అంటున్నారు. అంతా ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు ప్రవర్తిస్తున్నారట. ప్రభుత్వంపై అపోజిషన్ లీడర్లు విమర్శలు చేస్తుంటే తమకేం సంబంధం అన్నట్లుగా ఉంటున్నారట. ప్రతిపక్ష నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తుంటే సీనియర్ మంత్రులు కూడా సైలెంట్‌గా ఉంటున్నారట. ఇక ఎమ్మెల్యేల తీరు ఇంకా వేరు అన్నట్లుగా ఉందట పరిస్థితి. ఏదైనా పనిమీద ఎమ్మెల్యేలు..మంత్రుల దగ్గరకు వెళ్తే గంటల తరబడి వెయిట్ చేయిస్తున్నారట. కనీసం ఎమ్మెల్యేలమనే మర్యాద కూడా ఇవ్వట్లేదట. ముగ్గురు, నలుగురు మంత్రులైతే..ఎమ్మెల్యేలు టైమ్ అడిగితే.. కూడా బిజీగా ఉన్నామని.. ఫోన్లు చేస్తే లిఫ్ట్ చేయట్లేదట. దీంతో అసంతృప్తితో

- మిగతా 2వ పేజీలో



## హామీని నిలుపుకోలేని అసమర్థ సీఎం

సిగాచి బాధితులకు కోటి సాయమంటూ నమ్మబలికారు

మాట ఇచ్చి తప్పడం రేవంత్‌రెడ్డికి అలవాటు

రూ.కోటి పరిహారం వెంటనే విడుదలచేయాలి

మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 17 : సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి చాటుకున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయమంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్‌రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని ఎద్దేవా

- మిగతా 2వ పేజీలో



## క్షమాపణలు చెప్పాలి

లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య డిమాండ్

ఆ వ్యాఖ్యలు చేసివుంటే ఉపసంహరించుకుంటాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: భారత్-పాకిస్థాన్ విభజనలా ఏపీ తెలంగాణ విభ జన జరిగిందని గురువారం లోక్‌సభ లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు భగ్గుమన్నారు. తేజస్వి బేషరతుగా క్షమాపణ లు చెప్పాలని శుక్రవారం లోక్‌సభ వేదికగా వరంగల్ ఎంపీ కడియం కావ్య డిమాండ్ చేశారు. తెలంగాణపై బీజేపీ నేతలు అణువణువునా వ్యతిరేకతను నింపుకొన్నారని మండిపడ్డారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచే ఉద్దేశం తేజస్వికి లేదని, ఒకవేళ అలాం టి వ్యాఖ్యలు చేసిఉంటే, వాటిని ఉపసంహరించుకుంటామని స్పష్టం చేశా రు. తన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు వక్రీకరించారని

- మిగతా 2వ పేజీలో

## హార్ముజ్ తెరుచుకుంది



అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు ద్వారాలు తెరిచిన ఇరాన్

స్వాగతించిన అమెరికా ఊపిరిపీల్చుకున్న దేశాలు

ఊపందుకున్న స్టాక్‌మార్కెట్లు దిగొచ్చిన ముడి చమురు ధరలు

టెహ్రాన్/వాషింగ్టన్: ఇరాన్ ప్రపంచదేశాలకు శుక్రవారం శుభవార్త విన్పించింది. పర్షియన్ గల్ఫ్ జలాల మీదుగా పయనిస్తే నౌకలను తగలబెడతామనే బెదిరింపులకు స్వస్తిపలికి ఇకపై అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు హార్ముజ్ జలసంధిని బార్లా తెరుస్తున్నట్లు ఇరాన్ శుక్రవారం ప్రకటించింది. ఈ వార్త వినగానే ప్రపంచదేశాలు చమురు సంక్షోభం బారి నుంచి బయటపడ్డామని ఊపిరిపీల్చుకున్నాయి. స్టాక్‌మార్కెట్లకు సైతం కొత్త ఊపొచ్చింది. అమెరికా స్టాక్‌మార్కెట్లు లాభాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అనూహ్య డిమాండ్‌తో ముందస్తు కొనుగోళ్లతో ముడి చమురు ధర కొండెక్కగా తాజా వార్తతో ధర నేలచూపులు చూసింది. మార్చి నెలలో గరిష్టంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 119 డాలర్లకు పెరగ్గా శుక్రవారం శుభవార్త తర్వాత ఒక్కసారిగా 90 డాలర్ల దిగువకు దిగొచ్చింది. ధర శుక్రవారం ఉదయం 98 డాలర్లు ఉండగా హార్ముజ్ వార్త వెలువడగానే 10శాతం పడిపోయి 88డాలర్లకు చేరుకుంది. హార్ముజ్ గుండా నౌకల రాకపోకలు మొదలుకానున్నాయని ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వాగతించారు. "జలసంధిని తెరుస్తున్నామని ఇప్పుడే ఇరాన్ ప్రకటించింది. హార్ముజ్ గుండా రాకపోకలు ఊపందుకోనున్నాయి. థాంక్యూ. అయితే హార్ముజ్‌పై అమెరికా ఆధిపత్యం కొనసాగుతుంది. హార్ముజ్ గుండా ఇరాన్, దాని మిత్రదేశాల నౌకల రాకపోకలను

- మిగతా 2వ పేజీలో




## వీగిన మహిళా కోటా బిల్లు

బీజేపీ ట్రాప్‌లో కాంగ్రెస్.. 131 రాజ్యాంగ సవరణ బిల్లుపై ఓటింగ్

బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు

మూడింట రెండు వంతుల ఓట్లు రాకపోవడంతో వీగిన బిల్లు

అధికారికంగా ప్రకటించిన స్పీకర్ ఓం బిర్లా

మహిళా బిల్లు మళ్లీ మొదటికి.. మిగతా 2 బిల్లుల ఉపసంహరణ

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం పన్నిన పొలిటికల్ ట్రాప్‌లో కాంగ్రెస్ చిక్కుకుపోయిం ది. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల (131వ రాజ్యాంగ సవరణ) బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందదని తెలిసినప్పటికీ.. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ వ్యతిరేకమని, ఆ పార్టీని దోషిగా నిలబెట్టాలన్న కేంద్రం టార్గెట్ నెరవేరింది. చట్టసభల్లో

- మిగతా 2వ పేజీలో



## ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

ప్రస్తుత సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఎకో సిస్టం' అభివృద్ధి

ఆర్అండ్‌డీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అండ్ కాంప్లియెన్స్‌పై ప్రత్యేకదృష్టి

'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

2లో



## మరమ్మతులకు కమిటీ

ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అధికారులతో సమన్వయం

దెబ్బతిన్న బరాజ్‌ల వద్ద భూసార పరీక్షలు

వర్షాకాలం తర్వాత శాశ్వత మరమ్మతులు

వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 17: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశమూ లేదని నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. గత ప్రభు త్వ లోపాల వల్ల దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం,

- మిగతా 2వ పేజీలో

# మంత్రులు.. మోనార్క్!

(మొదటి పేజీ తరువాయి)

రగిలిపోతున్న శాసనసభ్యులు సందు చూసి సైలెంట్‌గా ఉండిపోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీలోని మంత్రుల తీరుపై కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే విమర్శలు ఎక్కుపెడుతున్నారు. అసెంబ్లీ వేదికగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. ఖమ్మం జిల్లా మంత్రుల తీరుపై విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యేలుగా తాము లేకపోతే..మీకు ఆ సీట్లు, గౌరవం ఉండదని ఘాటుగా హెచ్చరించారు. బాన్స్‌వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రులకు ఫోన్లు చేస్తే కూడా లిఫ్ట్ చేయడం లేదని.. అసలు ఇంతకీ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఛాన్స్ దొరికిన ప్రతిసారి ఎమ్మెల్యేలంతా..మంత్రుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ఆరోపణలు వచ్చినా..

కొందరు మంత్రులపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు చేస్తోంది. గతంలో తమ ప్రభుత్వంలోని మంత్రులపై ఇలాంటి ఆరోపణలు వస్తే ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ స్పందించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తప్ప మంత్రులపై ఆరోపణలు వచ్చిన సమయంలో స్పందించడం లేదు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహాపైలై బీఆర్ఎస్ గట్టిగానే ఆరోపణలు చేస్తోంది. వారి వారి శాఖల్లో జరిగే అంశాలపై అవినీతి ఆరోపణలు గుప్పిస్తోంది. అయితే తమపై వచ్చిన ఆరోపణలకే తామే సమాధానం చెప్పుకునే పరిస్థితి మంత్రులకు ఏర్పడింది. ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా..అమాత్యులను వెనకేసుకురావడం లేదనే చర్చ బలంగా జరుగుతోంది. పైగా మంత్రులు ఫోన్లు చేసి రెస్పాండ్ కావాలని చెప్పినా..ఎమ్మెల్యేలు..పార్టీ నేతలు లైట్ తీసుకుంటున్నారు. మంత్రులు మరీ ప్రెజర్ చేస్తే..ఒకరిద్దరు నేతలు మొహమాటానికి అలా మీడియా ముందుకు వచ్చి మమ అనిపిస్తున్నారు.

# వీగిన మహిళా కోటా బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. ఈ బిల్లుతో పాటు మరో రెండు బిల్లులపై తొలుత సభ్యులు ప్రసంగించేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. రాజకీయ పార్టీలకు ప్రతినిధులుగా కొందరు సభ్యులు ప్రసంగించిన తర్వాత, రాజ్యాంగ సవరణ బిల్లుపై స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. స్లిప్ పద్ధతి ద్వారా ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఓటింగ్ సమయంలో సభలో 528మంది సభ్యులు ఉన్నారు. వీరిలో బిల్లుకు అనుకూలంగా 298ఓట్లు వేశారు. వ్యతిరేకంగా 230 ఓట్లు వేశారు. మూడింట రెండు వంతుల మెజార్టీ రాకపోవడంతో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయి నట్లు స్పీకర్ ఓం బిర్లా అధికారికంగా ప్రకటించారు. ఈ సవరణ బిల్లు వీగిపోవడంతో మిగతా 2 బిల్లులను సైతం కేంద్రం ఉపసంహరించు కున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. బిల్లు ఆమోదం పొందాలంటే, 352 ఓట్లు అవసరం కాగా, బిల్లుకు అనుకూలంగా మరో 54 మంది సభ్యులు ఓటు వేయాల్సి ఉంది. ఇండియా కూటమి సభ్యులందరూ ఒక్కటై.. వ్యతిరేకంగా ఓటు వేసి బిల్లు వీగిపోయేలా చేశారనేది ఓటింగ్ ద్వారా స్పష్టమైంది. 2 డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లులతో పాటు కేంద్రం ఈ సవరణ బిల్లు తీసుకువచ్చింది. దీనివల్ల 2029 నాటికి మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని కేంద్రం ఆకాంక్షించింది. చివరకు బిల్లు వీగిపోవడంతో మహిళా కోటా బిల్లు కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఓటింగ్ తర్వాత లోక్‌సభను స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు.

# ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

హైదరాబాద్, ఏప్రిల్ 17: భవిష్యత్ 'ఏరోస్పేస్' రంగ అవసరాలకు అనుగుణంగా 'తెలంగాణ'ను దేశానికి ఒక వ్యూహాత్మక హబ్‌గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆర్‌అండ్‌డీ, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అండ్ కాంప్లియెన్స్... ఈ మూడింటిని అనుసంధానించగలిగే దేశాలు, రాష్ట్రాలే రాబోయే రోజుల్లో 'ఏరోస్పేస్'లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయన్నారు. ఆ దిశగా.. ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శుక్రవారం 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఫ్యూచర్ సినారియో ఇన్ ఏరోస్పేస్, ఆర్‌అండ్‌డీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సర్టిఫికేషన్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... 'ఏరోస్పేస్' అంటే కేవలం యంత్రాల తయారీ మాత్రమే కాదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ రంగంలో ఒకప్పుడు.. అమెరికా, రష్యా, ఐరోపా దేశాలదే ఆధిపత్యం చెలాయించేవని, ఇప్పుడు వాటికి ధీటుగా 'గ్లోబల్ సప్లై చైన్'లో మన దేశం కూడా 'కీ' రోల్ ప్లే చేస్తోందన్నారు. యునెస్కో గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో సైంటిస్టులు, ఇంజనీర్లు మన దేశంలోనే ఉన్నారన్నారు. కానీ... మెకిన్సే నివేదిక ప్రకారం.. ల్యాబ్స్‌లో జరిగే పరిశోధనల్లో 30శాతం కూడా కమర్షియల్ మాన్యుఫ్యాక్చరింగ్ దశకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పరిశోధనల్ని ఉత్పత్తులుగా మార్చాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. డెలాయిట్ గ్లోబల్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సర్వే ప్రకారం... నేడు 74 శాతం మంది ఏరోస్పేస్ సీఈఓలు కేవలం తక్కువ ఖర్చు కంటే పటిష్ఠమైన సప్లై-చైన్, తయారీ సామర్థ్యానికే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,000 కొత్త ఎయిర్ క్రాఫ్ట్‌ల అవసరం ఉంటుందని బోయింగ్, ఎయిర్బస్ సంస్థలు అంచనా వేశాయని తెలిపారు.

# హార్మూజ్ తెరుచుకుంది

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకుంటాం. ఇరాన్‌తో శాంతి ఒప్పందం 100 శాతం పూర్తయి, అమల్లోకి వచ్చేదాకా, యుద్ధం ముగిసేదాకా ఇరాన్‌కు చెందిన నౌకల రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతాయి. ఇరాన్‌తో చర్చల్లో ఇప్పటికే చాలా అంశాల్లో ఏకాభిప్రాయం సాధించాం. లెబనాన్ ప్రస్తావన, దానితో సంబంధం లేకుండానే ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంటాం. అమెరికా సాయంతో ఇరాన్ జలసంధిలోని పాత సముద్ర మందుపాతరలను తొలగిస్తోంది. మరోసారి హార్మూజ్‌ను మూసేయబోమని ఇరాన్ మాకు హామీ ఇచ్చింది. ప్రపంచానికి వ్యతిరేకంగా హార్మూజ్‌ను ఆయుధంగా ఇరాన్ ఉపయోగించడం సాధ్యపడదు"అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్‌పెట్టారు. "లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకిరావడంతో హార్మూజ్‌ను తెరుస్తున్నాం. తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో ఉండే ఈ పది రోజులపాటే హార్మూజ్ తెరచి ఉంటుంది"అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపారు. హార్మూజ్‌ను తెరవాలంటే తొలుత లెబనాన్‌పై కాల్పులు ఆపేయాలన్న డిమాండ్‌ను ఇజ్రాయెల్, అమెరికా తలొగ్గడంతోనే హార్మూజ్‌ను తెరుస్తున్నట్లు ఇరాన్ చెప్పుకొచ్చింది. దీనిపై అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ఎలాంటి స్పందనా లేదు. పాకిస్తాన్ సాయుధబలగాల సారథి, ఫీల్డ్ మార్షల్ ఆసిం మునీర్ టెహ్రాన్‌లో ఇరాన్ అగ్రనాయకత్వంతో చర్చలు జరిపిన మరుసటిరోజే హార్మూజ్‌పై ఇరాన్ కీలక ప్రకటన వెలువర్చడం గమనార్హం. మరోవైపు హార్మూజ్ గుండా వెళ్లే నౌకల పూర్తి రక్షణ కల్పించే లక్ష్యంతో ఉమ్మడిగా పనిచేయాలని డజన్లకొద్దీ దేశాలు కృతనిశ్చయంతో ముందుకెళ్తున్నాయి. ఈ మేరకు శుక్రవారం పారిస్‌లోని దేశాధ్యక్ష భవనంలో (బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీసహా 30 దేశాల అధినేతలు, 20 అంతర్జాతీయ కూటముల అధ్యక్షులు సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశానికి జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితదితరులు స్వయంగా, ఇతరులు వర్చువల్‌గా హాజరయ్యారు.

# మరమ్మతులకు కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

సుందిళ్ల బరాజ్‌లను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. ఇందుకోసం ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీ అధికారులతో సమన్వయం చేసు కుంటూ, ఐఐటీ ముంబైలోని నిపుణుల సహకారంతో అత్యాధునిక పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా భూసార పరీక్షలు పూర్తిచేసి, వర్షాకాలం తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. పారదర్శకత కోసం ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బరాజ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్‌తో ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ భేటీలో బరాజ్‌ల రిపేర్లు, పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక ను చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. అన్ని కో ణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో ప్రస్తుతం పరీక్షలు చేపడుతున్న తీరుపై ఎన్‌డీ ఎస్‌ఏ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే తాను స్వయంగా బరా జ్‌ల సందర్శనకు వస్తానని చెప్పారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బరాజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలి పారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు.

బీఆర్‌ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10 వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్ని విషయా లు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని పేర్కొన్నారు.

### దశలవారీగా శాస్త్రీయ పరీక్షలు..

బరాజ్‌ల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిపుణుల సంస్థలను ప్రభుత్వం నియమించింది. డిజైనింగ్, టెస్టింగ్ సంస్థలు రంగంలోకి దిగాయి. డిజైన్‌కు ముందు అవసరమైన పరీ క్షలు, అధ్యయనాలను సీడబ్ల్యూపీఆర్‌ఎస్ సంస్థ చేస్తుంది. బరాజ్‌ల పునరుద్ధరణ కోసం జీపీఆర్(గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్) స్కానింగ్, డ్రోన్ సర్వేలు, బోర్ హోల్స్, జియోటెక్నికల్, జియో ఫిజి కల్ పరీక్షలతో భూమి, అక్కడ నిర్మాణాల సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోను న్నారు. వివిధ సంస్థల మధ్య సమన్వయం కోసం ప్రభుత్వం సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సీడబ్ల్యూపీఆర్‌ఎస్ ప్రతినిధులు, డిజైనింగ్ సంస్థ ప్రతినిధులు, ఇతర టెక్నికల్ ఏజెన్సీలు సభ్యులుగా ఉన్నారు. పరీక్షలు సకాలంలో జరిగేలా చూడడం.. అవసరమైన డేటా సమయానికి అందించడం, అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవడం ఈ కమి టీ చూసుకుంటుంది. ఈ ప్రక్రియ అంతా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగేందుకు, కేంద్రస్థాయి నిపుణుల పర్యవేక్షణ కూడా ఉండే దిశగా ప్రభుత్వం చర్యలు తీసు కుం టోంది. అవసరమైతే ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా ఇందులో చేర్చే అవకాశముం ది. ప్రస్తుతం బరాజ్‌ల ఫౌండేషన్, కట్ ఆఫ్ వాల్ పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనా వేయనున్నారు. అన్నిరకాల పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత, ఇప్పుడున్న నిర్మాణ లోపాలు గుర్తించి... పూర్తి సమాచారం విశ్లేషణల ఆధారంగా వాటికి అను గుణంగా పునరుద్ధరణ పనులకు డిజైనింగ్ సంస్థ కొత్త డిజైన్ల ను సిద్ధం చేస్తుంది. ఈ డిజైన్‌ను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి పంపించి.. వాళ్ల మార్గదర్శకాలకు అను గుణంగా పు నరుద్ధరణ పనులను ప్రభుత్వం చేపడుతుంది. భవిష్యత్‌లో 50-100 ఏళ్ల పాటు బరాజ్‌లు సురక్షితంగా భద్రంగా ఉండేలా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### కాళేశ్వరం బరాజ్‌ల రిపేర్‌పై ఫోకస్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేప ట్టింది. ఈ మూడు బరాజ్‌ల పరిస్థితిని అంచనా వేసి, పనులను సమన్వయం చేయడానికి ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ నీటి పారుదల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. బరాజ్‌ల భద్రత, నిర్మాణ స్థితిని సమగ్రంగా అంచ నా వేయడానికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకు జియో-ఫిజికల్, జియో-టెక్నికల్ పరిశోధనలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మాన్సూన్ ప్రారంభానికి ముందే అంటే 2026 మే 30 నాటికి ఈ పరిశోధనలు పూర్తి చేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన కమిటీకి టన్నెల్స్ అండ్ సేఫ్టీ విభాగ కార్యదర్శి కల్నల్ పరిచిత్ మెహ్రా అధ్యక్షత వహించనున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, సాంకేతిక నిపుణులు, కన్సల్టెన్సీ సంస్థలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ, పరిశోధనల అమలు నుంచి డిజైన్ పనుల వరకు అన్ని దశలను సమన్వయం చేయనుంది. కమిటీకి ప్రభుత్వం స్పష్టమైన మార్గ దర్శకాలు జారీచేసింది. కమిటీ పనులకు సహకరించేందుకు డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ అజ్మల్ ఖాన్, కన్సల్టెంట్ యాదగిరి నియమితులయ్యారు.

# క్షమాపణలు చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

తేజస్వి సూర్య పేర్కొన్నారు. ఏపీ, విభజనను కాంగ్రెస్ విధ్వం సంగా మార్చిందని చెప్పడమే తన ఉద్దేశమని వెల్లడించారు.

### త్యాగాలను అవమానించారు: ఎంపీ కడియం కావ్య

దేశ విభజన చేసినట్లు ఏపీ, తెలంగాణను విడదీశారని బీజేపీ ఎంపీ తేజ స్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, ఆయన బేషరతుగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె లోక్‌సభలో మాట్లాడుతూ.. వందలాది మం ది యువకుల ఆత్మబలిదానాలతో తెలంగాణ ఏర్పడిందని, వారి త్యాగాలను అవమానించేలా తేజస్వి అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఏపీ తెలంగాణ విభజనను ఇండియా పాక్ విభజనతో పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. దశాబ్దాల పాటు సాగించిన పోరాటాల తర్వాతే తెలంగాణ సిద్ధించిందని పేర్కొన్నారు. రాజకీయంగా కాంగ్రెస్‌కు నష్టమని తెలిసినా, పెద్ద మనసుతో సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తుచేశారు. బీజేపీ నేతలు అణువణువునా తెలంగాణపై వ్యతిరేకత నింపుకొన్నారని ఆరోపించారు. తెలంగా ణలో బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. దేశ జీడీపీలో ముఖ్యపాత్ర పోషించే దక్షిణాదికి కేంద్రం అన్యాయమే చేస్తున్నదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని, 2023లో ఆమోదించిన బి ల్లును అమలు చేయకుండా ఆలస్యం చేయడంపై కేంద్రం సమాధానం చెప్పాలని డి మాండ్ చేశారు. కులగణన చేపట్టకుంటే ఓబీ సీ, ఎస్టీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు. ఆయా వర్గాల ప్రాతినిధ్యాన్ని బలహీనపరిచే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. మహిళలపై ప్రేమ ఉందని చెప్పుకునే ప్రధాని మోదీ, వారిపై జరిగిన అన్యాయ ఘటనల్లో ఎందుకు స్పం దించరని నిలదీశారు. తెలంగాణ హక్కులపై ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. దేశంలోని ప్రతివర్గానికి న్యాయం జరిగేలా బిల్లు లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

### ఉపసంహరించుకుంటాం: కిషన్‌రెడ్డి

తెలంగాణ ప్రజలను కానీ, స్వరాష్ట్ర ఉద్యమాన్ని కానీ అవమానించే ఉద్దేశం ఎంపీ తేజస్వీ సూర్యకు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరణ ఇచ్చారు. ఒకవేళ తేజస్వి అలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటే, వాటిని ఉపసంహరించుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీయడం తమ ఉద్దేశం కాదని వివరించారు. కాంగ్రెస్ సభ్యులు డీలిమిటేషన్‌ను తప్పుబడుతున్న సమయంలో, వారిని విమర్శించే క్రమంలో ఆ వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కేవలం డీలిమిటేషన్ చర్చ నుంచి దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ నేతలు వివాదాన్ని పెద్దది చేస్తున్నాయని మండిపడ్డారు.

### కాంగ్రెస్ ఎంపీల నిరసన

బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఏపీ తెలంగాణ విభజనను దేశ విభజనతో పోల్చడాన్ని తప్పుబడుతూ శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో తెలంగాణకు చెందని కాంగ్రెస్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్, సురేష్‌కుమార్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మల్లు రవి, కడియం కావ్య, వేం నరేందర్‌రెడ్డి నిరసన వ్యక్తంచేశారు. తేజస్వి తెలంగాణ ఏర్పాటుపై విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేశారని, అందుకు ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆత్మ బలిదానాలకు కాంగ్రెస్ పార్టీయే కారణమన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలనూ వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించి పార్లమెంట్ రికార్డుల నుంచి తేజస్వి వ్యాఖ్యలను శాశ్వతంగా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ రామసహాయం మాట్లాడుతూ.. ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై ద్వేషపూరితంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పాటును భారత్ విభజనకు ముడిపెట్టడం సరికాదని మండిపడ్డారు.

### నా వ్యాఖ్యలను వక్రీకరించారు: తేజస్వి

తాను చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ఎంపీల నుంచి వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభ వేదికగా వివరణ ఇచ్చారు. తెలంగాణ ఏర్పాటుపై తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు వక్రీకరించారని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమాన్ని విధ్వంసంగా మార్చిందని చెప్పడమే తన అభిమతమని పేర్కొన్నారు. రాష్ట్రం కోసం 1200 మంది యువకులు బలిదానాలు చేసుకున్నారని, దానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని చెప్పడమే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. తను తప్పకుండా తెలంగాణ అమరులను గౌరవిస్తానని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని వెల్లడించారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రజల్లో లేనిపోని భయాలను సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

# నేనే స్వయంగా పాక్ వెళ్తా!

(మొదటి పేజీ తరువాయి)




వ్యక్తం చేశారు. నెవాడా పర్యటనకు వెళ్లే ముందు వైట్‌హౌస్ లాన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇరాన్‌తో పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఒప్పందం ఖరారు అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇస్లామాబాద్‌లో ఈ ఒప్పందం జరిగితే తాను తప్పకుండా వెళ్తానని ట్రంప్ చెప్పారు. అక్కడ వారు తనను ఆహ్వానిస్తున్నా రని వెల్లడించారు. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలను విజయవంతం చేయడానికి పాకిస్తాన్ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. పాక్ మధ్యవర్తులు ఈ విషయంలో ఎంతో అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ చర్చలు సఫలమైతే చమురు సరఫరా మెరుగుపడు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చమురు ధరలు గతంలో కంటే భారీగా తగ్గుతాయని అంచనా వేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. అణ్వాయుధాలు ఉంటే పెద్ద సమస్యలు ఎదురవుతాయని హెచ్చరించారు. అణ్వాయుధాలు తయారు చేయబోమని ఇరాన్ కూడా అంగీకరించిందని ఆయన తెలిపారు. చర్చల్లో భాగంగా భూగర్భంలో ఉన్న యురేనియాన్ని అప్పగించడానికి కూడా ఇరాన్ ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా మధ్య చర్చలు పునరుద్ధరించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ టెహ్రాన్ వెళ్లారు. అక్కడ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహ్మద్ బాఘేర్ ఘాలిబాఫ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు దౌత్యపరమైన కసరత్తు కొనసాగుతోంది.

### రెండు నెలలే యుద్ధం చేశాం

ఇరాన్‌తో రెండు నెలలే యుద్ధం చేశామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా చేసిన ఇతర యుద్ధాలు 18 ఏళ్లు, నాలుగేళ్లు కొనసాగాయని చెప్పారు. తాజా యుద్ధంలో తాము త్వరలోనే విజయం సాధించనున్నట్లు వెల్లడించారు. ఇరాన్‌పై సైనిక చర్యకు దిగకపోయుంటే.. చెడు పరిణామాలు ఎదురయ్యేవని పేర్కొన్నారు. ఇక ఇరాన్‌లో త్వరలో కీలక పరిణామాలు చోటుచేసుకోవచ్చని ట్రంప్ వెల్లడించారు. చమురు ధరల గురించి పేర్కొంటూ.. రానున్న వారం రోజుల్లో ఏం జరుగుతుందో చూద్దాం అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తాను ఇప్పటివరకు 9 యుద్ధాలను ఆపానంటూ మరోసారి ట్రంప్ పేర్కొన్నారు. తాను ఆపే యుద్ధాల్లో ఇది పదోది కాబోతుందని ట్రూత్ సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. శుద్ధి చేసిన యూరేనియంను అమెరికాకు అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించిందని యూఎస్ అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరలో రెండు దేశాల మధ్య డీల్ కుదరవచ్చని శ్వేతసౌధంలో జరిగిన పత్రికా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'శుద్ధి చేసిన యూరేనియాన్ని అప్పగించేందుకు వారు అంగీకరించారు. త్వరలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కూడా కుదిరే అవకాశం ఉంది. ఇరాన్, అమెరికా సంబంధాలు చాలా వరకూ మెరుగు పడ్డాయి. దీన్ని చాలా మంది నమ్మలేకపోవచ్చు. నాలుగు వారాల పాటు సాగిన దాడులు, దిగ్బంధనం వంటివి ఫలితాన్ని ఇచ్చాయని నేను అనుకుంటున్నాను' అని ట్రంప్ అన్నారు. రెండు దేశాల మధ్య ఈ వారాంతంలోనే మరోసారి చర్చలు జరిగే అవకాశం ఉందని కూడా ట్రంప్ అన్నారు. అయితే, కాల్పుల విరమణను మరోసారి పొడిగించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసిపోనున్న విషయం తెలిసిందే. గతంలో బెట్టు చేసిన ఇరాన్ అనేక విషయా ల్లో రాజీధోరణితో ఉందని చెప్పుకొచ్చారు.

# హామీని నిలుపుకోలేని అసమర్థ సీఎం

(మొదటి పేజీ తరువాయి)



చేశారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్‌రెడ్డికే చెల్లిందని శుక్రవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. సిగాచి పరిశ్రమ ప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకాలు అసెంబ్లీ సాక్షిగా బట్టబయలయ్యాయని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజ నర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని, కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని, ప్రభు త్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మో సం అంతాఇంతా కాదని, ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకా రం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ.24.51 కోట్లను విభ జించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ.45.40 లక్షలు మాత్రమేనని స్పష్టంచేశారు. సీఎం హామీ ఇచ్చిన రూ.కోటి పరిహా రంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ.54.60 లక్షలు, మొత్తంగా రూ.29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిప డ్డారు. కోట్లు ఇస్తామని గొప్పలు చెప్పి, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో బాధిత కుటుంబానికి లక్ష రూపాయలు మాత్రమే చెల్లించడం అత్యంత శోచనీయమన్నారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షల రూపాయలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని, అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన రూ.25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని వివరిం చారు. చికిత్సపొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని, ఇక ప్రమాదంలో కాలి బూడి దై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూ నే ఉందని తెలిపారు. ప్రభుత్వానికి ఏమా త్రం చిత్తశుద్ధి ఉన్నా వందల కోట్ల టర్నోవర్ ఉన్న సిగాచి కంపెనీ డైరెక్టర్ల ఆస్తులను రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద అటాచ్ చేయాలని, వాటిని అమ్మి అయినా బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఏ కొర్రీలు లేకుండా కోటి పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.



# జగిత్యాల సభ విజయవంతం చేయాలి

**గోదావరిఖని, ఏప్రిల్ 17,(ప్రజా తీర్పు):**

ఈనెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖనిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలన ప్రజల ఆశలను నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులకు ప్రాధాన్యం లేకుండా వ్యవహరిస్తున్నారని, జగిత్యాల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత జీవన్ రెడ్డిని పక్కన పెట్టడం దురదృష్టకరమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, స్కాములు, అవినీతి ఆరోపణలతో పాలన నడుస్తోందని చందర్ విమర్శించారు. మూసి ప్రక్షాళన పేరుతో భారీగా నిధుల దుర్వినియోగానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. హైడ్రా చర్యలతో మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చివేయడం అన్యాయమని పేర్కొన్నారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి రక్షణగా నిలుస్తుందని అన్నారు. జగిత్యాల సభ కేవలం రాజకీయ సభ మాత్రమే కాకుండా, రాష్ట్ర రాజకీయ దిశను మార్చే చారిత్రాత్మక ఘట్టమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, మండల, పట్టణ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 19న ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ మినీ ప్లీనరీ

- బి ఆర్ స్ పార్టీ టేకులపల్లిమండల అధ్యక్షులు బొమ్మర వరప్రసాద్ గౌడ్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు, టేకులపల్లి) ఏప్రిల్ 17**



టేకులపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవానికి ముందుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈనెల 19న ఖమ్మం పట్టణంలోని మమత కాలేజీ గ్రౌండులో బీ=ూ పార్టీ మినీ ప్లీనరీని నిర్వహించాలని పార్టీ నిర్ణయించినది. ఈ మినీ ప్లీనరీ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు , మాజీమంత్రివర్యులు,సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. కావున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీ=ూ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు మరియు మన మాజీ శాసనసభ్యులు,ఇంచార్జ్ బానోత్ హరిప్రియ సూచనలమేరకు మన టేకులపల్లి మండలంలోని ,గ్రామ పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపీపీ,మాజీ జడ్పిటిసి,సీనియర్ నాయకులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ ౹ాూజూ అధ్యక్షులు,సర్పంచులు, మాజీ సర్పంచులు,విద్యార్థి, యువజన నాయకులు,వార్డ్ సభ్యులు,మాజీ వార్డు సభ్యులు,మహిళా నాయకులు, ూజ, ూు, దీజ, మైనారిటీ ముఖ్య నాయకులు,సోషల్ మీడియానాయకులు,ఉద్యమకారులు,కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరు కావాలని కోరారు.



# వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామి దర్శించిన ఐజీపి రమేష్ నాయుడు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 17:**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర రైల్వే మరియు రోడ్డు భద్రత ఐజీపి గారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఐజిపి గారికి ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. వారి వెంట వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, ఆర్.ఐ సురేష్, ఎస్సైలు, అలాగే ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు ఎన్. రాజేందర్, ఆలయ ఉద్యోగులు కూడా హాజరయ్యారు.

# తేజస్వి సూర్య క్షమాపణ చెప్పాలని డిమాండ్

**మంథని, ఏప్రిల్17 (ప్రజాతీర్పు)**



పార్లమెంట్ లో ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుల పోరం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి డిమాండ్ చేశారు. చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం పోరాడిన వారిని అవమానించే విధంగా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు మహిళా విభాగం కార్యదర్శి వనజారాణి, ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, కార్యదర్శి బత్తుల శంకర్, కమాన్పూర్ మండల అధ్యక్షుడు రామస్వామి, చందుపట్ల ప్రదీప్ రెడ్డి సంయుక్త ప్రకటనలో టి యు ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డిమాండ్ చేశారు.

# రాజకీయ దురుద్దేశంతోనే సెస్ స్వాధీనం

- సెస్ ను ప్రైవేటీకరణ కోసం ప్రభుత్వ కుట్రలు.
- 30 వేల కోట్ల నష్టంలో ఉన్న ఎన్పీడీసీఎల్ లో లాభాల ' సెస్ 'ను ఎలా విలీనం చేస్తారు
- పద్ధతి పాటించకుండా పోలీసు పహరాల మధ్య స్వాధీనపరుచుకోవడం అక్రమం.
- తమ 39 మాసాల పాలనలో ఎక్కడ అవినీతి జరగలేదు
- కృష్ణయ్య కమీషన్ అవినీతి లేదని క్లీన్ చీట్ రిపోర్ట్ ఇచ్చింది.
- చైర్మన్ చిక్కాల రామారావు

**(పాషసయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) ఏప్రిల్ 17**



వందలాదిమంది పోలీసు పహరాల మధ్య, పద్ధతులు పాటించకుండా సెస్ సంస్థ ను ఎన్పీడీసీఎల్ స్వాధీనం చేసుకోవడం అక్రమమని, లాభాల బాటలో ఉన్న ఈ సంస్థ ను 30 వేల కోట్ల నష్టం లో ఉన్న ఎన్పీడీసీఎల్ లో విలీనం చేయడం దారుణమని సిరిసిల్ల సహకారం విద్యుత్ సరఫరా సంస్థ సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆరోపించారు. శుక్రవారం సెస్ సంస్థలోని తన చాంబర్ లో డైరెక్టర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సెస్ సంస్థను కుట్రపూరితంగా స్వాధీనం చేసుకున్న సంఘటనగా పేర్కొంటూ పరిస్థితులను వివరించారు. ఈనెల 1న పోలీసు బలగాలు స్థానిక పోలీసుల సహకారంతో సంస్థను చుట్టుముట్టి స్వాధీనం చేసుకున్నారని, దీనిపై తాము వివరణ కోరితే పైనుండి ఆదేశాలు ఉన్నాయని సీఎండి స్పష్టం చేశారన్నారు. అలాగే సంస్థలోని, సంస్థకు సంబంధించిన అన్నిచోట్ల సీసీ కెమెరాలు తొలగించారని తెలిపారు. మరునాడు రహస్యంగా 6,7 నెంబర్ల జీవోలను తీశారని, వాటిని తమకు ఇవ్వలేదని, తాము నెట్ లో డౌన్లోడ్ చేసుకున్నామన్నారు. 3.10 లక్షల మంది వినియోగదారులు, 3.51 లక్షల విద్యుత్ కనెక్షన్ల తో సాగుతున్న సంస్థను లేని అవినీతి బూచిని చూపుతూ కేవలం ఏడెనిమిది మంది ఫిర్యాదును ఆసరా చేసుకుని సంస్థను స్వాధీనం చేసుకోవడం సరైంది కాదన్నారు. ఎలాంటి పద్ధతులు పాటించలేదని, దీనివల్ల వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తూ మొత్తం స్వాధీనం చేసుకున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాజకీయ దురుద్దేశంగా తాము భావిస్తున్నట్టు చైర్మన్ వెల్లడించారు. ఏడాదికాలంగా కుట్రలు జరుగుతున్నాయని, ప్రభుత్వ పెద్దలు పరోక్షంగా హెచ్చరికలు కూడా చేశారన్నారు. కృష్ణయ్య కమిషన్ క్లీన్ చీట్ ఇచ్చింది 16 ఏళ్లు నివేదికను తొక్కి పెట్టారు సంస్థలో 2007 నుండి 2010 వరకు జరిగిన కార్యక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిందని పాలకవర్గం దుర్వినియోగం చేశారని ఆరోపణలపై 51 ఎంక్వయిరీ కూడా జరిగిందన్నారు. దీనిపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సెస్ పర్సన్ ఇన్చార్జిగా ఉన్న అరుణ్ కుమార్ 2012లో విచారణకు ఆదేశించగా, కృష్ణయ్య కమిషన్ విచారణ జరిపి 2013లో జెసికి నివేదిక సమర్పిస్తూ, పాలకవర్గం ఎలాంటి దుర్వినియోగానికి పాల్పడలేదని స్పష్టం చేసిందన్నారు. 2010 అక్టోబర్ 26 తర్వాత తాను పదవి నుంచి దిగిపోయానని తర్వాత అల్లాడి రమేష్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించగా కృష్ణయ్య రిపోర్టును 16 సంవత్సరాల పాటు దాచి పెట్టారన్నారు. ఈ విజిలెన్స్ రిపోర్టును ఎందుకు బహిర్గతం చేయలేదని చిక్కాల రామారావు ప్రశ్నించారు. కృష్ణయ్య రిపోర్టులో బైలా నిబంధనలు, ఎన్పీడీసీఎల్ గైడెన్స్ ప్రకారం అవినీతి లేకుండా పారదర్శక పాలన సాగించినట్లు రిపోర్టు స్పష్టం చేసిందన్నారు. అయితే 3,08,97,306 రూపాయల వర్క్ ఆర్డర్లను సంస్థ పూర్తి చేయలేదని, దీనిపై 13 మంది ఉద్యోగులు బాధ్యులు అని చెప్పకుండా కేవలం పాలకవర్గంపై అభియోగాలు మోపుకుంటూ కుట్రపూరితంగా అవినీతి అంటూ సాకు చెబుతున్నారని ఆరోపించారు. సెస్ సభ్యుల రూ.7 కోట్ల వాటాధనం, రూ.400 కోట్ల ఆస్తులతో , కోట్ల విలువైన విద్యుత్తు లైన్లు, భవనాల తో కూడుకొని సెస్ సంస్థ ఉన్నదన్నారు. మూడు సంవత్సరాల రికార్డులు, విజిలెన్స్ రిపోర్టులు తీసుకెళ్లారని, ఎలాంటి రిపోర్టు తమకు సబ్మిట్ చేయలేదని, రాత్రికి రాత్రే ఎన్పీడీసీఎల్ ద్వారా ప్రభుత్వం రైతుల, నేతన్నల, సభ్యుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇది రాజకీయ దురుద్దేశం కాదా? ఎంతవరకు ఇది న్యాయమో ఆలోచించాలని రైతులను, వినియోగదారులను చైర్మన్ కోరారు. తమ సేవ ఘనమని భావించేలా ఎన్పీడీసీఎల్ అధికారులు 15 రోజుల పాటు అరచేతిలో బెల్లం చూపిస్తూ, సినిమా చూపిస్తున్నారని అన్నారు. సెస్ సరిహద్దుల చుట్టూ ఉన్న ప్రాంతాలలో ఎన్పీడీసీఎల్ సేవలు ఎంత అధ్వానంగా ఉన్నాయో, వినియోగదారులు ప్రజలు ఎంత దుర్భర స్థితులను ఎదుర్కొంటున్నారో గమనించాలని అన్నారు. లాభాల బాటలో ఉన్న సెస్ సంస్థను నష్టాలలో ఉన్న ఎన్పీడీసీఎల్ సంస్థలో విలీనం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. కొద్దిరోజులుగా ప్రభుత్వ పెద్దలు తమను బెదిరిస్తూ వచ్చారని సంస్థను తొలగిస్తామని పేర్కొన్నారని, తమ పాలకవర్గంపై సీఎం కోపంగా ఉన్నారని బుకాయించారని అన్నారు. తమ మూడు ఏళ్ల మూడు నెలల పాలల్లో ఎక్కడ అవినీతి జరగలేదన్నారు. సంస్థ నష్టాలలో లేదు, ప్రభుత్వమే సబ్సిడీలు ఇవ్వకుండా బకాయిల భారం పెంచింది. మరి సంస్థలో నష్టం ఎక్కడ ఉన్నదని ప్రశ్నిస్తూ ప్రభుత్వం తమకు ఇవ్వాల్సిన వ్యవసాయ సబ్సిడీలు నెల నెల ఇవ్వకుండాబకాయలుబకాయలు పెట్టడం వల్ల ఎన్పీడీసీఎల్ సర్ చార్జీలు వేస్తూ బకాయిల భారం పెంచిందన్నారు. రూ.680 కోట్లు మనం ఇవ్వాల్సి ఉండగా రూ. 787 కోట్లు సంస్థకు రావాల్సి ఉన్నదని ఇందులో నష్టం ఎక్కడ ఉన్నదని, ఇప్పటికే సంస్థను లాభాల బాటలో తీసుకువచ్చి శాశ్వత నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఉద్యోగులను పనిచేయమంటే పాలకవర్గంపై కోపం వ్యక్తం చేస్తారని, తమకు సబ్సిడీ బకాయిలు నెలకు రూ.3.50 రావాల్సి ఉండగా అవి సక్రమంగా చెల్లించకపోవడంతో 24 కోట్లకు ఎస్టీ బిల్లులో కలిపి తమకు బాకాయలు పంపుతారని తెలిపారు. రావలసిన బకాయిలపై ఈ ఆర్ సి కి తాము నివేదించామని, దీనిపై రూ. 471 వ్యవసాయ కనెక్షన్ల సబ్సిడీలో 392 కోట్లు మంజూరు చేసి గత మార్చి 30న తమకు ఈఆర్సి ఇచ్చిందన్నారు. ఇందులో తమ తప్పులు ఎక్కడ ఉన్నాయన్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో సెస్ సంస్థను విలీనం చేశారని, ఆ సమయంలో ఎమ్మెల్యే రాజేశ్వరరావు, మంత్రిగా ఉన్న జీవన్ రెడ్డితో కలిసి నివేదించగా సీఎం, చీఫ్ సెక్రటరీ తో మాట్లాడి లాభాల బాటలో ఉన్న సంస్థను ఎలా చేస్తారని పేర్కొంటూ విలీనం చర్యను తక్షణమే రద్దు చేశారని చైర్మన్ వెల్లడించారు. ప్రభుత్వ జోక్యం లేకుంటే సంస్థను బ్రహ్మాండంగా నడిపిస్తామని కేవలం 13 కోట్ల విద్యుత్ డిమాండ్ ను 22 కోట్లకు పెంచామని 18 కోట్ల రెవెన్యూ వసూలు చేస్తున్నామని వెల్లడించారు. న్యాయపోరాటమే ఏకైక మార్గం- ఉద్యమానికి అన్ని పార్టీలు కలిసి రావాలిప్రస్తుతం న్యాయపరంగా పోరాటం చేస్తామని ఇదే ఏకైక మార్గమని, రాజకీయంగా నిర్ణయాలు తమ బీఅర్ఎస్ పార్టీ చూసుకుంటుందని తెలిపారు. తమ పాలకవర్గంపై కోపం ఉంటే సెస్ సంస్థకు ఇష్టమైన వారితో కమిటీ వేసి లైసెన్స్ రెన్యూవల్ చేస్తూ యధావిధిగా కొనసాగించాలని, సెస్ ను కొనసాగిస్తామంటే తమ పాలకవర్గం మూకుమ్మడిగా రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతులు, నేతన్నలు, పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ త్యాగం చేస్తామని స్పష్టం చేశారు. ఈనెల 20 తర్వాత పోరాట పంథాపై నిర్ణయం ప్రకటిస్తామన్నారు. సెస్ అందరి సంస్థ అని, అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని సంస్థను, కాపాడుకుందాం అని చిక్కాల కోరారు. 3.10 లక్షల మంది సభ్యులు, 400 కోట్ల ఆస్తులు ఉన్న సంస్థను విలీనం చేయడం సరికాదని తాము ఒప్పుకోబోమన్నారు. తమ సంస్థపై ఫిర్యాదులు చేసిన వారు చట్ట విరుద్ధంగా పనులు చేయించుకోవడానికి తమ వద్దకు వస్తే వాటిని తాము తిరస్కరించామని, ఆ కోపంతో తనపై తప్పుడు ఆరోపణలు తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని చైర్మన్ ఆరోపించారు.

### సెస్ ప్రైవేటీకరణ కోసమే ప్రభుత్వం కుట్ర.

సంస్థను సహకార సంఘం నుంచి తొలగించి నూరు శాతం ప్రవేటీకరణ చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదన్నారు ఎందుకోసం ఈ ఆర్ సి 17 సర్కిళ్ల లో సిరిసిల్ల సెస్ ను కలుపుకొని 18వ సర్కిల్ గా నిర్ణయిస్తూ ఇటీవల ఈఆర్సి నోటిఫికేషన్ జారీ చేస్తూ, నెలరోజుల గడువుతో ప్రజాభిప్రాయం కోరిందన్నారు. సంస్థ పూర్తి స్థాయిలో విలీనం కాకుండానే సంస్థ ఉద్యోగులను ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. దేశంలో 60 ఏళ్ల పాటు పాలించిన పార్టీ వారు సెస్ పై అవినీతి అని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సంస్థకు ఉత్తమ సేవలను గుర్తిస్తూ అనేక అవార్డులు వచ్చాయని, ఈ సంవత్సరం కూడా అవార్డు వస్తుందని తపనతో పాలన సాగించామని చైర్మన్ చిక్కాల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరైన సదుపాయాలు కల్పించాలి

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 17**



తెలంగాణ రాష్ట్రంలో వీస్తున్న వడగాలులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వరి ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా తగిన సదుపాయాలు కల్పించాలని ఎండపల్లి మండల బిజెపి నాయకులు మామిడిపల్లి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నిలువ నీడ కల్పించేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాట్లు చేయాలని, తగినంత టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, రైతులు హమాలీలు వడదెబ్బకు గురికాకుండా చల్లని తాగునీరు, మజ్జిగ, ఓ ఆర్ ఎస్ పాకెట్లు అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్య తూకం రోజు ఉదయం 11 లోపు తర్వాత సాయంత్రం 4 గంటల తర్వాత వేయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ తాకిడికి రైతులు వేచి చూడకుండా కేంద్రాల నిర్వహకులు కొనుగోలు టోకెన్ విధానం పారదర్శకంగా నిర్వహించాలి. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో రైతులు వడదెబ్బకు గురైతే ప్రాథమిక చికిత్స అందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లాడి వీరారెడ్డి

**చెన్నారావుపేట, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**




ఈనెల 18న జరగబోయే ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలి కాంగ్రెస్ తార్నాకలో మేనిఫెస్టో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఉప్పునూతల లింగమూర్తి ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో కోరడం జరిగినది హైదరాబాదులో మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్, తార్నాకలో జరిగే సదస్సును విజయవంతం చేయాలి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా ఉమ్మడి వర్కింగ్ ప్రెసిడెంట్ కౌడగాని రాజీరు వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లాడి వీరారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి మేడిది లక్ష్మణ్ శంకర్ రాజు మల్లేష్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసే ప్రభుత్వం..

- గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాగితాలకు పరిమితమైన ప్రభుత్వం..
- పూర్తిస్థాయి వసతులతో లక్ష్మీనరసింహస్వామి సదన్ అందుబాటులోకి..
- సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 17**



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం పని చేసే ప్రభుత్వమని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కాగితాలకు పరిమితమైన ప్రభుత్వమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ సదన్ ను మంత్రి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రూ. 5 కోట్ల అంచనాలతో ప్రారంభించిన శ్రీ లక్ష్మీనరసింహ సదన్ నిర్మాణానికి గత ప్రభుత్వం కేవలం కోటి రూపాయలు మాత్రమే నిధులు విడుదల చేసిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మి నరసింహ సదన్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో పాటు ఆర్థిక శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారి చొరవతో నిధులు విడుదల చేయించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహ సదన్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. కోటి విడుదల చేసే తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే శ్రీ లక్ష్మీనరసింహ సదన్ ను అందుబాటులోకి తీసుకురావడానికి రూ. 2.24కోట్లు విడుదల చేయించినట్లు మంత్రి తెలిపారు. కొత్తగా నిర్మించిన గదుల్లో ఫర్నిచర్ కోరకు రూపాయలు కోటి వరకు వెచ్చించినట్లు మంత్రి తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దైవదర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆరు వీఐపీ గదులతో పాటు సామాన్య భక్తుల కోసం 60 గదులు అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు మంత్రి వివరించారు. శ్రీ లక్ష్మీ నరసింహ సదన్ మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి అధికారులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ పలు సూచనలు చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సదన్ పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నియమించి పరిశుభ్రతను కాపాడాలని అధికారులకు సూచించారు. దేవాదాయ శాఖ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు వారంలో ఒకసారి సదన్ ను సందర్శించి పరిసరాల పరిశుభ్రత మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేముల రాజేష్ తో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ధర్మపురి మున్సిపల్ అధికారులతో పాటు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలి కలెక్టర్

**మెదక్, ఏప్రిల్ 17 (ప్రజా తీర్పు ):**

ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరించాలి. సమ్మర్ యాక్షన్ ప్లాన్ తో గ్రామాలలో డ్రింకింగ్ వాటర్ సమస్యలను నిర్మూలించాలి ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సమన్వయంతో గ్రామంలో సుపరిపాలన అందించాలి. 15వ ఆర్థిక సంఘం విధుల వినియోగంపై సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు వర్క్ షాప్ నిర్వహణ గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని.ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరిం. చాలని. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా వినియోగించి గ్రామా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు మోడల్ గా తీర్చిదిద్దాలని, గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులపై



దృష్టి సారించాలన్నారు, అంగన్వాడీ బిల్డింగ్స్, జిపి బిల్డింగ్స్ లేని గ్రామాలకు నూతన బిల్డింగ్స్ ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ సమన్వయంతో గ్రామ పంచాయతీలో పనులు సవ్యంగా నడవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని 15 ఆర్థిక సంఘం నిధులను అన్ని గ్రామాలకు ప్రభుత్వం అందించిందని ,వాటితో గ్రామాల్లో సమస్యలు లేకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. నిధుల వినియోగం లో అక్రమాలకు తావులేదన్నారు. నిధులు సక్రమంగా వినియోగించక పోతే ,అక్రమాలు జరిగితే సర్పంచ్ , కార్యదర్శుల పై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో త్రాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఈ.ఈ మిషన్ భగీరథ ఇంట్రా సంపత్ కుమార్, గ్రిడ్ డి.ఈ నాగభూషణం, డిఎల్పిఓలుసాయి బాబు, తిరుపతి రెడ్డి ,అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కౌన్సిలర్ ఒగ్గు రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**జమ్మికుంట ఏప్రిల్ 17 ప్రజాతీర్పు**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 28వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు రమేష్ తల్లి కనకమ్మ ఇటీవల మృతిచెందగా వారి స్వగ్రామం మడిపల్లి లో కనకమ్మ చిత్ర పటానికి చైర్మన్ ప్రశాంత్ కుమార్ పూల మాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు పొనగంటి రాము, కోలుగురి సురేష్, కోలుగురి సురంజన్,చింతల శ్రీనివాస్, పోలు బిక్షపతి, పోల్నేనీ వేణుగోపాల్, మైస రవి,మంద రాజేష్, కందాల రాము,చింటూ తదితరులు పాల్గొన్నారు.

## తేజస్వీ సూర్య వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- టీజేఎస్ మహిళా నేత అరికిల్ల స్రవంతి డిమాండ్.
- ఈ అంశంపై తెలంగాణ బీజేపీ ఎంపీ లు నోరు తెరువాలి.

**జమ్మికుంట ఏప్రిల్ 17 ప్రజాతీర్పు**



తెలంగాణ రాష్ట్రంపై అవగాహన లేకుండా తప్పుడు వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండనీయమని తెలంగాణ జన సమితి (టి.జే.ఎస్) మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి అన్నారు. కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలు ప్రజల మనో భావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆమె విమర్శించారు. ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని,దానిపై అపోహలు కలిగించే విధంగా మాట్లాడటం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనేది తెలంగాణ ప్రజల దీర్ఘకాల పోరాట ఫలితమని గుర్తుచేశారు. అలాంటి చారిత్రాత్మక ఉద్యమాన్ని తక్కువ చేసి చూపే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.అలాగే, పార్లమెంట్‌లో ఇటువంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ వాటిని కేంద్రం ఖండించకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. గతంలో సుష్మా స్వరాజ్, ఎం. వెంకయ్య నాయుడు వంటి ప్రముఖులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తిని పరిగణలోకి తీసుకోకుండా ప్రస్తుత బీజేపీ నాయకులు వ్యవహరించడం సరైంది కాదన్నారు.ఈ అంశం తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరు తెరవకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.డీలిమిటేషన్ అంశంపై స్పందిస్తూ, జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేసే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగే విధంగా కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.తెలంగాణ గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అరికిల్ల స్రవంతి కోరారు.




## బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ విజయవంతం

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 17**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ బెల్లంపల్లి, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆదిలాబాద్, సింగరేణి పాలిటెక్నిక్ మంచిర్యాల కళాశాలలకు చెందిన తుదివర్ష విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా ఈఈఈ,ఈసీఈ, ఈఐఈ శాఖల విద్యార్థులు ఈ నియామక ప్రక్రియలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో మేధా సంస్థ ప్రతినిధులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, రైల్వే ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్, పవర్ సిస్టమ్స్ రంగాలలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఉద్యోగ నియామక,అధికారి,అధ్యాపకులు అతిథులను స్వాగతించి, ఇండస్ట్రీ--ఇన్స్టిట్యూట్ అనుసంధానం ప్రాముఖ్యతను వివరించారు. తదుపరి సంస్థ ప్రతినిధులు కంపెనీ వివరాలు, ఉద్యోగ అవకాశాలపై ప్రజెంటేషన్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రాత పరీక్ష, సాంకేతిక పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

**ఈ డ్రైవ్‌లో మొత్తం 13 /85 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అందులో**

- బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ నుండి 8 మంది (ఈఈఈ)
- ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆదిలాబాద్ నుండి 4 మంది(ఈఈ ఈ)
- సింగరేణి పాలిటెక్నిక్ మంచిర్యాల నుండి 1 విద్యార్థి (ఈఈ ఈ)ఎంపికయ్యారు.

## ప్రజా సమస్యల కోసం పోరాడితే అక్రమ కేసులా?

- వక్ఫ్ బోర్డు ర్యాలీ లో పాల్గొన్న బిజెపి నేతలకు నోటీసులు.
- ప్రజలపై కేసులు పెట్టడం, దాడులు చేయడమేనా ప్రజా ప్రభుత్వం!
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెప్తారు.

**బోడుప్పల్, ఏప్రిల్ 17 ( ప్రజాతీర్పు ):**



వక్ఫ్ బోర్డు ర్యాలీలో బీజేపీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, బోడుప్పల్ ఈస్ట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్ పాల్గొన్నందుకు 22 మంది బీజేపీ నాయకులు, అమాయక ప్రజల పైన అక్రమ కేసులు బుక్ చేసి నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఓట్లతో గెలిచి ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ సర్కార్ ప్రజల కోసం ప్రజా సమస్యలపై పోరాడే వారిపై అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటని, పుండు మీద కారం చల్లినట్టు వక్ఫ్ బోర్డు సమస్యతో బోడుప్పల్ పరిధిలో సుమారు పదివేల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించిన కాంగ్రెస్ అమాయక ప్రజల పైనే కేసులు నమోదు చేసి నోటీసులు పంపడం ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రజా సమస్యలను పరిష్కరించలేని ప్రజా ప్రభుత్వం ప్రజలపై దాడులు చేయడంలో ముందుంటుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని గోనే శ్రీనివాస్, తుప్పత్ ఆనంద్ అన్నారు.



## దరఖాస్తులు పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 17**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హాజీపూర్ మండలం వేంపల్లి, మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ ప్రాంతాలలో వెంచర్ ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులకు సంబంధించి భూమిని హాజీపూర్ మండల తహసిల్దార్ పుష్పలత, పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వెంచర్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలము దొంగలతో జాగ్రత్త

- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం
- అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ శ్రీ. డి. వి. శ్రీనివాస రావు ఐపిఎస్

**మెదక్, ఏప్రిల్ 17 ( ప్రజాతీర్పు ):**



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వేసవి కాలం సెలవులు ప్రారంభం అవుతున్న వేళ పెళ్లి ముహూర్తాలు, స్నేహితులతో, ఫ్యామిలీ మెంబర్స్ తో అంతా టూర్ ప్లాన్ చేస్తూ ఉంటారు. ఇదే అదునుగా దొంగతనాలకు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గారు ఒక ప్రకటనలో తెలిపారు. దొంగతనాల నియంత్రణ కోసం జిల్లా ప్రజలు ఈ దిగువ తెలియజేసిన నిబశీధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించగలరు. ఇంటి బయట, డాబాల పైన పడుకునేవారు మెడలో నగలని జాగ్రత్తగా పెట్టుకోండి మరియు ఇంటిలో బంగారు ఆభరణాలు ఉంచకండి. బసుల్లో ప్రయాణాలలో మీ బ్యాగ్ను మీ పైన ఉంచుకొని గట్టిగపట్టుకొని వెంట అంటిపెట్టుకోండి, గుర్తు తెలియని వ్యక్తులు తిను బండరాలు, కూల్డ్రింక్స్ లాంటివి ఇస్తే తినకండి తీసుకోకండి. మీరు ఊరికి వెళ్ళే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు మరియు బంగారం ఆభరణాలు పెట్టకండి వాటిని బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్న చోట దాచుకోవడం ఉత్తమం. బీరువా తాళం చెవులు బీరువా పైన కానీ, బీరువాలోని బట్టల క్రింద కానీ, ఇంట్లో కానీ పెట్టి వెళ్లవద్దు.ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి గేటు బయట గొళ్ళెం పెట్టకండి.ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలి. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండి.బయట గేటుకు లోపల నుంచి తాళం వేయండి. బయటకు వెళ్ళేపుడు ఇంట్లో మరియు బయట లైట్ వేసి ఉంచండి.పేపర్ బాయ్ మరియు పాలు వేసే వాళ్లకు రావద్దని చెప్పండి. నమ్మకమైన వాచ్ మెన్ లను మాత్రమే నియమించుకోండి. మీరు ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వండి.ఊరికి వెళ్ళిన తర్వాత కూడా ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలి.బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్త. వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిది. మీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది, భద్రత ఎక్కువగా ఉంటుంది. మీ ఇంటికి సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకుని ఐ= రహస్య ప్రదేశాలలో భద్రపర్చుకోవాలి. మరియు మొబైల్ యాప్ ద్వారా సీసీకెమెరా దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది. మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయకండి. మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే 100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయండి.

## ఎంపీ తేజస్వి సూర్య బేషరతు గా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- ఎం,ఎస్, డబ్ల్యూ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బోయిని వంశీకృష్ణ

**చిగురుమామిడి, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**



తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెస్ డబ్ల్యూ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బోయిన వంశీకృష్ణ అన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందని,తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయా దాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని, దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వల్ల , వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని తెలుసుకోవాలన్నారు. చరిత్ర మూలాలను అవమానిస్తే చూస్తూ ఊరుకోమని , అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆకలి నైనా ఓర్చుకుంటారు కానీ, అవమానాన్ని మాత్రం భరించలేరు అనే విషయం తెలుసుకొని వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మహిళల నాయకత్వంలో పనిచేసిన పార్టీ కాంగ్రెస్ అని, రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చారని,సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారని అప్పుడు రాజ్యసభలో ఆమోదించారని అన్నారు. బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని ఇంత కాలం మోడీ ఈ బిల్లును పట్టించుకోలేదనే విషయాన్ని బీజేపీ నేతలు తెలుసుకుంటే మంచిదన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

-జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ,ఏప్రిల్ 17(ప్రజాతీర్పు )**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, రోజువారీగా ఆసుపత్రుల్లో సగటున నమోదవుతున్న ఓపి లు, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోకి వైద్యం కోసం వచ్చే రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆసుపత్రులలో అవసరమైన మందులు అవసరాన్ని బట్టి ఇండెంట్



పెట్టిసమకూర్చుకోవాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే జనాలకు వివిధ విభాగాల సమాచారం తెలిసేలా బోర్డులు ఖచ్చితంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల మెరుగుదల కొరకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ అక్షర పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**భైంసా, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**

మండల కేంద్రము లోని శ్రీ అక్షర పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సంధర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి,తల్లితండ్రులను ఆకట్టుకున్నారు.శ్రీ అక్షర పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అట్టహసంగా డ్రెస్సులు ధరించిన చిన్నారులు ఆంగ్లంలో తమ అనుభవాలను పంచుకోవడం వారిలో కనిపించిన అత్మ విశ్వాసం, వాక్చాతుర్యం అందరినీ ఆకట్టుకున్నాయి. ఇది తల్లితండ్రులకు గర్వకారణంగా నిలిచింది. పాఠశాల డైరెక్టర్ జారికోటి శుభాష్ మాట్లాడుతు ఈ విద్యా సంవత్సరం లోఉత్తీర్ణులై పే తరగతులకు వెళుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత మార్కులతో జీవితం లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల సర్వతోముఖభివృదికి కృషి చేసిన ఉపాధ్యాయులను అయన అభినదించారు. విద్యార్థులు ప్రదర్శించిన స్ష?ంకృతిక ప్రదర్శనలు కార్యక్రమాలు,నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కార్య క్రమంలో ప్రతీ విద్యార్థికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశరు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ సాయికుమార్, అకడమిక్ డైరెక్టర్ మధు సిందే, ఇతర సిబ్బంది,తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తాపడి యువరైతు మృతి...

**చిగురుమామిడి, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లెలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం గ్రామానికి చెందిన రైతు కాటం కిషన్ రెడ్డి ఉదయం 10 గంటల సమయంలో తన వ్యవసాయ పొలం నుండి వడ్లను ట్రాకర్ తో ఇంటికి తరలిస్తుండగా కాటం కుంట కట్ట ఎక్కే క్రమంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం అదుపుతప్పి బోల్తా పడడగా డ్రైవర్ కిషన్ రెడ్డి మీద ట్రాక్టర్ ఇంజన్ పడడంతో తల నడుముకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.మృతుడి తండ్రి కాటం లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.



## మాజీ సర్పంచ్ కు అండగా బీఆర్ఎస్ పార్టీ అండగావుంటుంది

**(వెగ్గళం రాధాకిషన్, ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 17**

ఏప్రిల్ 17:ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ,వెంకటనర్సింహారెడ్డి దంపతులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ తరలించిన విషయం తెలుసుకుని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి సెస్ డైరెక్టర్ రవిందర్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ వేణురావు మరియు బీఆర్ఎస్ నాయకులు,వల్లంపట్ల గ్రామ ప్రజలతో కలిసి పోలీస్ స్టేషన్ కి వెళ్లి వారికి సంఘీభావం తెలిపి,సాయంత్రం పోలీస్ స్టేషన్ నుంచి బయటికి తీసుకొచ్చారు. మాజీ సర్పంచ్ అనసూయవెంకటనర్సింహారెడ్డి లకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని.పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు చల్లా నారాయణ, కట్ట వెంకటరెడ్డి,తిరుపతి రెడ్డి, సిద్ధం శ్రీనివాస్, చంద్రశేఖర్, బాలరాజు, పర్శరాం తదితరులు పాలుగోన్నారు.

## మండలానికి విచేస్తున్న ఏం ఎల్ ఏ వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం స్మార్ట్ ఫోన్ ల పంపిణి

**(వెగ్గళం రాధాకిషన్, ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 17**

ఏప్రిల్ 17 :ఇల్లంతకుంట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభోత్సవాలకు విచేస్తున్న ఏంఎల్ఏ కవ్వంపల్లి సత్యనారాయణ కావున అలాగే మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో అంగన్వాడీ టీచర్ లకు స్మార్ట్ ఫోన్ ఫోన్ ల కార్యక్రమం కలదు కావున ఇట్టి కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ డైరెక్టర్లు సర్పంచ్ లు మరియు కార్యకర్తలు పాలుగోనగలరని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటి రెడ్డి భాస్కర్ రెడ్డి తెలియజేసారు.

## ప్రభుత్వ ఉద్యోగుల జేఏసి ఆధ్వర్యంలో నిరసన



**చిగురుమామిడి, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**

ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం చేయాలని శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల జేఏసి పిలుపుమేరకు చిగురుమామిడి రెవెన్యూ కార్యాలయ అధికారులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన పీఆర్సీ, పెండింగ్ డిఎలు,పదోన్నతులు వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో తహశీల్దార్ ఎం రమేష్, రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడిన ఎంపీ
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్

**సూర్యాపేట ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**




పార్లమెంట్లో తెలంగాణ విభజనను అవమానపరిచేలా మాట్లాడిన పార్లమెంటు సభ్యుడు తేజస్వి సూర్య వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం రోజు కోదాడ పట్టణంలోని ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే తెలంగాణ ప్రజలకు,తెలంగాణ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని,ఎంతోమంది ప్రాణ త్యాగాలు,ఎన్నో పోరాటాలతో తెలంగాణ ఏర్పడిందని, నాడు తల్లిని చంపి బిడ్డను బతికించారని అవమానపరిచి,నేడు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని పాక్ విభజనతో పోల్చటం దుర్మార్గమని, తెలంగాణ బిడ్డల త్యాగాలను అవమాన పరుస్తుంటే చూస్తూ ఊరుకోమని,వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కోదాడ మండల అధ్యక్షులు కోళ్లూరి వెంకటేశ్వర్లు, మునగాల మండల అధ్యక్షులు పోలంపల్లి వెంకటేశ్వర్లు,అనంతగిరి మండల అధ్యక్షులు ధారావత్ సైదులు,తొలి దశ మలిదశ ఉద్యమకారులు ఏనుగుల యల్లేశ్వరరావు,మట్టపల్లి శ్రీనివాస్ గౌడ్,ఎస్ కే మీరా,బొమ్మకంటి వీరబాబు, కరుణాకర్,మండవ నాగేశ్వరరావు బొంత శివాజీ, ముక్కు రాములు,ఆదిమల్ల రాజశేఖర్, రాజు, ఆనంద్, గోపికృష్ణ,సైదులు,సత్యనారాయణ,ఎండి హుస్సేన్ అలీ,సుదర్శన్,తిరుమలరావు,బాలిబోయిన ఏడుకొండలు,కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంత యువకుడు డాక్టరేట్ సాధించడం గర్వకారణం

మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట హుస్నాబాద్ ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి ప్రశాంత్ ఇటీవల డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, డా. ప్రశాంత్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తూ, గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించడం గర్వకారణమని తెలిపారు. సమాజ అభివృద్ధికి, ముఖ్యంగా యువతకు ప్రేరణగా నిలిచే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఆయన సాధించిన విజయం హుస్నాబాద్ నియోజకవర్గానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని మంత్రి పేర్కొన్నారు. డా. కల్లెపల్లి ప్రశాంత్ హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామానికి చెందినవారు. ఆయన కాకతీయ యూనివర్సిటీ లో ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ పట్టా పొందారు. విద్యాభ్యాస కాలంలోనే విద్యార్థి నాయకుడిగా చురుకుగా పనిచేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ స్థాయిలో పలు ఉద్యమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు. తన విద్యా ప్రయాణంలో గురువుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, స్నేహితుల సహకారం ఎంతో దోహదపడినట్లు డా. ప్రశాంత్ పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు కొనసాగించి, విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలవాలని తన లక్ష్యంగా తెలిపారు.

## తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం ఆగ్రహం

- మంత్రి పొన్నం లేఖపై కేంద్రం స్పందించాలి: కేఎల్ఆర్
- బేషరత్తుగా క్షమాపణలు చెప్పాలి:కిచ్చెన్న

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.17**



మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ....తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బేషరత్తుగా ఆపార్టీ క్షమాపణలు చెప్పాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి డిమాండ్ చేశారు. సుధీర్ఘ పోరాటానికి నాటి సోనియమ్మ మద్దతు తెలిపితేనే విభజన సాధ్యమైందన్నారు. అవగాహన లేని మాటలపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం స్పందించాలని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖకు కేంద్రం, స్పీకర్ స్పందించాలని కిచ్చెన్న కోరారు.ఆరు దశాబ్దాల పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడటంపై తెలంగాణ యావత్ సమాజం ఆగ్రహిస్తోందని కేఎల్ఆర్ అన్నారు.తేజస్వీ సూర్య వ్యాఖ్యలను సమర్థించటం సిగ్గు చేటని కాషాయ పార్టీకి లక్ష్మారెడ్డి కిచ్చెన్నగారు సూచించారు. మహిళా బిల్లుతోపాటు మరో రెండు బిల్లుల వెనుక బీజేపీ కుట్ర చేస్తుందన్నారు. అన్యాయమైన బిల్లులను కాంగ్రెస్ అగ్రనాయకత్వం అడ్డుకుంటుందన్నారు.



## ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్ అత్యంత కీలకం

ఏసీపీ సదానందం

**హుస్నాబాద్, ఏప్రిల్17 (ప్రజాతీర్పు)**

రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో అందించే సరైన ప్రథమ చికిత్స మనిషి ప్రాణాన్ని నిలబెడుతుందని ఏసీపీ సదానందం పేర్కొన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రజలకు, ఆటో డ్రైవర్స్,అంబులెన్స్ డ్రైవర్లు మరియు వాలంటీర్లకు ప్రథమ చికిత్సపై హుస్నాబాద్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ప్రమాదం జరిగిన మొదటి 60 నిమిషాల్లో బాధితుడికి సరైన వైద్య సాయం అందితే ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 108 కి కాల్ చేసి బాధితులను ఆసుపత్రికి తరలించాలని, అంబులెన్సు వచ్చేలోగా ప్రథమ చికిత్స అందించాలని, అంబులెన్సు డ్రైవర్స్ కి కూడా ప్రాథమిక వైద్య మెళకువలు తెలిసి ఉండాలని సూచించారు. రక్తస్రావాన్ని అరికట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే సి.పి.ఆర్ చేయడం వంటి అంశాలపై డ్రైవర్లకు, వాలంటీర్లకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే వాలంటీర్లు బాధితులకు భరోసా కల్పిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అంబులెన్స్ సకాలంలో చేరుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమం లో హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్సై లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మహేశ్వరం పోలీస్ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయ సంఘం అవగాహన సదస్సు

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.17**




మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని.. శనివారం ఉదయం 10 గంటలకు మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం అధ్యక్షులు ఒగ్గు శ్రీశైలం ఆదేశానుసారం మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారుల చే మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం మరియు అనుబంధ సంఘాల సభ్యులందరికీ అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఈ యొక్క సదస్సులో మహేశ్వరం గ్రామ దుకాణదారుల ప్రతి ఒక్కరూ పాల్గొనవలసిందిగా కోరడమైనది మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం ప్రచార కార్యదర్శి షేక్ హాజీ బాబా.

# టిజిఈజెఏసీ పిలుపు మేరకు సబ్ కలెక్టర్ ఆఫీస్ భైంసా దగ్గర మధ్యాహ్న భోజన సమయంలో నిరసన

**భైంసా, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)**



టిజిఇజెఏసీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయడం జరిగింది ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ గారికి మెమోరండం సమర్పించడం జరిగింది ముఖ్యంగా ఉద్యోగ ఉపాధ్యాయుల లకు రావలసిన రెండో పీఆర్ సి ని 51 శాతం ఫిట్మెంట్తో అమలు చేయాలని దాదాపు రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయుల యొక్క 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులను రెండు దఫాలలో విడుదల చేయాలని మరియు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు హెల్త్ కార్డులుఅమలు చేయాలని 2024ఏప్రిల్ నుంచి రిటైర్ అయిన పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఎస్ వెంటనే రద్దుపరిచి పాతపెన్షన్ విధానాన్ని అమలుపరుస్తూ సెప్టెంబర్ 1 2004 కంటే ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈనిరసన కార్యక్రమంలో టీజిఈజేఏసీ భైంసా డివిజన్ చైర్మన్ శ్రీహరి, టీజిఈజేఏసీ జిల్లాకో చైర్మన్ రమణ, ఏస్ టీ యూ సంఘ జిల్లా అధ్యక్షులు టీజిఈజేఏసీ జిల్లా నాయకులు భూమన్న ,జిల్లా నాయకులు, పి శ్రీనివాస్ మండల బాధ్యులు రవి పెన్షనర్ల ,భైంసా డివిజన్ అధ్యక్షులు నాగనాథ్ ప్రధాన కార్యదర్శి భాస్కరరావు జిల్లా నాయకులు మాణిక్ రావు తదితర ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# జూన్ 2లోపు పీఆర్‌సీ అమలు చేయాలి: రంగారెడ్డి జేఏసీ డిమాండ్

(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.17





తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు,ఉపాధ్యాయులు, కార్మికులు మరియు పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారానికి రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ ( టిజిఈజెఏసి) సమరశంఖం పూరించింది. జిల్లాలోని అన్ని మండల,డివిజన్ మరియు జిల్లా కేంద్రాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు,కార్మికులు, పెన్షనర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. 2వ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటై 30 నెలలు గడిచినా నివేదిక వెలువడకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నివేదికను విడుదల చేసి, 51% ఫిట్‌మెంట్‌తో జూన్ 2వ తేదీలోపు 2వ పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 13,000 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అలాగే ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను వెంటనే అమల్లోకి తీసుకువచ్చి,ఉద్యోగులు మరియు పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి,పాత పెన్షన్ విధానం (ఓపిఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 01/09/2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 15.25 లక్షల ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నాలుగు ప్రధాన డిమాండ్లతో పాటు మరో 64 పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జేఏసీ కోరింది. లేకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించింది. ఈ సందర్భంగా టిజిఈజెఏసి నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి మెమోరాండం సమర్పించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ కే.రామారావుతో పాటు పలువురు నాయకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.



## చలివేంద్రం ప్రారంభం

(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 17:

వేములవాడ మున్సిపల్ కార్యాలయం వద్ద చలివేంద్రం ప్రారంభంచిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, పాదచారులు మరియు పట్టణ ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుండా మున్సిపల్ యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ వైస్ చైర్మన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## వేబ్రిడ్జ్ మోసం... రైతుల కష్టానికి నష్టం

సూర్యాపేట ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)

వేబ్రిడ్జ్ మోసంతో రైతుల కష్టానికి నష్టం వాటిల్లిన సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం తాళ్ళ మల్కాపురం గ్రామంలోని వేబ్రిడ్జ్ మోసం వెలుగులోకి వచ్చింది. తూకం వేయడంలో అవకతవకలు జరుగుతు న్నాయని రైతులు ఆరోపిస్తు న్నారు.వెలిదండ గ్రామానికి చెందిన గండు సతీష్ ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట పైరు బోరెంలో పోసుకుని తాళ్ల మల్కాపురం శ్రీ వెంకటేశ్వర వెయిట్ బ్రిడ్జి లో వేమెంట్ పెట్టగా 4440 కాంటా వచ్చింది.అక్కడ నుంచి మిర్యాలగూడ వైష్ణవి మిల్లుకి పోగా అక్కడ కూడా వేమెంట్ పెట్టడంతో 4560 కాంట వచ్చింది.120 కేజీలు తక్కువ రావడంతో రైతు శ్రీ వెంకటేశ్వర వెయిట్ బ్రిడ్జి యాజమాన్యం యమగాని అనిల్ ని అడిగితే మా ఇష్టం మా దగ్గర అలానే వస్తుంది క్వింటా కాకపోతే మూడు క్వింటాలు తేడ వస్తుందని రైతుతో దురుసుగా ప్రవర్తించదని రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ మోసం కారణంగా రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి సరైన ధర రావాల్సిన చోట,తూకం లోపాల వల్ల నష్టం వాటిల్లుతుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకున్న కానీ శ్రీ వెంకటేశ్వర వెయిట్ బ్రిడ్జి తీరు మారడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే వేబ్రిడ్జ్‌పై తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## కోహెడలో ఉద్యోగులు, ఉపాధ్యాయల నిరసన

### తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించిన సంఘం నేతలు

కోహెడ, ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)

టిజెయి జాక్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరికి నిరసనగానల్ల బ్యాడ్జీలు ధరించి కోహెడ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఆకుల రాముకు మెమోరండం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని 51 శాతం పిఆర్సి ఫిట్మెంట్, తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్న డిఏలు, వెంటనే విడుదల చేయాలని నగదు రహిత ఆరోగ్య కార్డులు వెంటనే జారీ చేయాలని కాంట్రిబ్యూటర్ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలికోరారు. ఈ కార్యక్రమంలో టిజీయి జాక్ నాయకులు అన్నాడి మహేందర్ రెడ్డి దర్శనాల నారాయణ ముత్యాల సురేందర్ రెడ్డి రచ్చ జగదీశ్వర్ బుడుగు రాజేందర్ మహ్మద్ మహమూద్ మ్యాడ శ్రీధర్ మోర గణేష్ అబ్దుల్ కరీమ్ బి ప్రభాకర్ వి చంద్రశేఖర్, సంపత్ డి సత్యానందం నర్సింహారెడ్డి గజ్జెల రాజమౌళి సూద్దాల గీత రిటైర్డ్ ఉద్యోగ నాయకులు బద్దం సంజీవ రెడ్డి గాదాసు బలరాం రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



## మానేరు అలయన్స్ క్లబ్ లైఫ్ మెంబర్షిప్ సమావేశం విజయవంతం

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఏప్రిల్ 17

అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137ఏ ఆధ్వర్యంలో అలయన్స్ క్లబ్ ఆఫ్ మానేరు లైఫ్ మెంబర్ క్లబ్ విజయవంతంగా ప్రారంభించబడింది. క్లబ్ సభ్యులందరూ జీవితకాల సభ్యత్వం (లైఫ్ మెంబర్షిప్ ) ఒకేసారి చెల్లింపు చేశారు. విదేశీ సోషల్ ఆర్గనైజేషన్లలో, ముఖ్యంగా అమెరికాకు చెందిన సంస్థల్లో, జీవితకాల సభ్యత్వం లేకుండా ప్రతి సంవత్సరం సుమారు ?10,000 నుండి ?15,000 వరకు (అమెరికన్ డాలర్ ల రూపంలో) చెల్లించాల్సి ఉంటుంది. స్వదేశీ సంస్థ అయిన అలయన్స్ క్లబ్ లో కేవలం ?11,000 చెల్లించి జీవితకాల సభ్యత్వం పొందవచ్చు. ఈ సందర్భంగా పిఐడి (పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ) డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశీ సంస్థల్లో డబ్బు ఖర్చు చేయకుండా స్వదేశీ సంస్థలో చేరాలని సూచించారు. అలయన్స్ క్లబ్ ఆఫ్ మానేరు ముఖ్య సభ్యులు అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ కార్యదర్శి గుగ్గిల సత్యం ఖజాంచి కైరం ఆంజనేయులు పీఆర్ఓ మొహమ్మద్ అబ్దుల్ కుదుర్ సభ్యులు దాసరి తిరుపతిరెడ్డి సంగం అనిల్ కుమార్ డాక్టర్ బీర్పూర్ పురుషోత్తం కూర నరేష్ రెడ్డి (సర్పంచ్) నజియా ఖుదిజా (అడ్వకేట్), గంగుల మహేందర్ రెడ్డి పార్వతి శంకర్ బోనగిరి రాజేశం దేవరాజ్ శ్రీకాంత్, నగునూరి వినోద్ (వినయ్) తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137ఏ 2026--27 ప్రమాణ స్వీకారోత్సవం ఏప్రిల్ 24 సాయంత్రం 5:00 గంటలకు స్థానిక ఐఎంఏ హాల్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమశీలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ (వాసుదేవ హాస్పిటల్) ఇంజనీర్ కోల అన్నారెడ్డి జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్ సుద్దపెల్లి ప్రసాద్ విద్యాసాగర్ రెడ్డి పుల్లాల శ్యామ్ నాగేశ్వర్ కుమారస్వామి ఆచివర్స్ వెంకటేశ్వర్లు నాగరాజు సుధాకర్ టీవీ రావు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

(దండే భూమన్న ప్రజాతీర్పు మంచిర్యాల ) ఏప్రిల్ 17

టిజిఈజెఏసి రాష్ట్ర కార్యవర్గంలో తీసుకున్న నిర్ణయం మేరకు టిజిఈజెఏసి మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మరియు సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యం లో మంచిర్యాల జిల్లా ఐడిఓసి కార్యాలయం లో భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ కి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగులు గెజిటెడ్ ఉద్యోగులు ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ప్రధాన సమస్యలు తెలంగాణ 2వ పీఆర్సీ నీ శివశంకర కమిటీ నుండి తెప్పించుకొని51% ఫిట్ మెంట్ తో వెంటనే అమలు చేయాలని ఉద్యోగుల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ని వెంటనే అమలు చేయాలని, 13 వేల పైచిలుకు ఉన్న పెండింగ్ బిల్లులను ఏక మొత్తంలో ఒకేసారి విడుదల చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దుచేసి ఒపీఎస్ ను అమలు చేయాలని, ప్రభుత్వం ముందు ఉంచిన 63 ఇమాలను పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగినది. తర్వాత ఐ డి ఓ సి కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో టిజిఈజెఏసి కో చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, భూముల రామ్మోహన్, శ్రావణ్ కుమార్, నాగుల గోపాల్, చక్రపాణి, శ్రీనివాసరావు వేణుగోపాల్, సుమిత్ రమేష్, సునీత, దుర్గా ప్రసాద్, వైస్ చైర్మన్ లు రాజా వేణు మనోజ్ జయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో గుజరాత్‌దే పైచేయి.. కోల్‌కతాకు ఐదో ఓటమి..!



పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఆడిన ప్రతి మ్యాచ్ ఓడిపోతూనే ఉంది. ఇప్పటికే నాలుగింటా కంగుతిన్న కోల్‌కతాను ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ మట్టికరిపించింది. కామెరూన్ గ్రీన్(79) మెరుపులతో గుజరాత్‌కు సవాల్ విసిరిన కోల్‌కతాను బౌలర్లు గట్టెక్కించలేదు. ఛేదనలో శుభ్‌మన్ గిల్ (86) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో విరుచుకుపడగా.. రాణించారు. 5 వికెట్ల తేడాతో గుజరాత్ ఘన విజయం సాధించగా.. అజింక్యా రహానే సేన ఐదోసారి నిరాశతో మైదానం వీడింది. మూడుసార్లు ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఈసారి ఎందుకనో అదృష్టం కలిసి రావడం లేదు. టోర్నీ ఆరంభం నుంచి బోణీ కోసం నిరీక్షిస్తున్న ఆ జట్టును గుజరాత్ టైటాన్స్ చిత్తుగా ఓడించింది. ఆఖరి ఓవర్ వరకూ పోరాడినా గెలుపు తలుపు మాత్రం తట్టలేకపోయింది కేకేఆర్. సొంత మైదానంలో పేసర్లు కగిసో రబడ(3-23), సిరాజ్(2-232)ల విజృంభణతో కోల్‌కతాను 180కే కట్టడి చేసిన గుజరాత్.. ఛేదనలో చెలరేగింది. ఓపెనర్ సాయి సుదర్శన్(22) విఫలమైనా.. శుభ్‌మన్ గిల్(86) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు.



## జక్కుల వీరయ్య యాదవ్‌కు ఘన సన్మానం

- ఎలక్ట్రికల్ శానిటరీ అసోసియేషన్, కందిబండ యాదవ సంఘం అభినందనలు

సూర్యాపేట ఏప్రిల్ 17 (ప్రజాతీర్పు)

హుజూర్ నగర్ పట్టణంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా గెలుపొందిన జక్కుల వీరయ్య యాదవ్ అడ్వకేట్, మాజీ కౌన్సిలర్‌కు పలు సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానాలు కొనసాగుతున్నాయి. ఎలక్ట్రికల్ శానిటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, జక్కుల వీరయ్య యాదవ్ సాధించిన విజయం యాదవ సమాజానికి గర్వకారణమని తెలిపారు. ఆయన న్యాయవాద వృత్తిలో మరింత ప్రతిభ కనబరుస్తూ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. జక్కుల వీరయ్య యాదవ్ మాట్లాడుతూ, తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కందిబండ యాదవ సంఘం ఆధ్వర్యంలో కూడా జక్కుల వీరయ్య యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ రుక్కయ్య, చెన్నకేశ నాగయ్య, కంప సాటి వీరబాబు, రాజుల నాగరాజు, తోడేటి నాగరాజు, చెన్నకేశ ప్రసాదు, పిల్లి భాస్కర్, తోడేటి నరసింహ, పిల్లి వినయ్, మని సాయి తదితరులు పాల్గొన్నారు. మొత్తం మీద ఈ సన్మాన కార్యక్రమాలు జక్కుల వీరయ్య యాదవ్‌కు మరింత ఉత్సాహాన్ని అందించాయి.

## రేపాకలో టీబీ వైద్య పరీక్షలు ప్రారంబించిన సర్పంచ్ కాత మల్లేశం

(వెగ్గళం రాధాకిషన్, ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 17

రేపాక గ్రామంలో జిల్లా వైద్య బృందం ఇల్లంతకుంట వైద్య బృందం ఆధ్వర్యంలో రేపాక ఉపకేంద్రం లో 99రోజుల ప్రణాళిక లో భాగంగా రేపాక లో టీబీ విముక్తి బాభియాన్ ప్రోగ్రామ్ క్రింద రేపాక ప్రజలకు ప్రభుత్వ డాక్టర్ బృందంస్ Xరే వివిధ వైద్య పరీక్ష లు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమన్ని రేపాక లో సర్పంచ్ కాత మల్లేశం ప్రారంభించాగా ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ కొదని మహేష్ జిల్లా ౦దీ సూపర్వేజర్ జైత్య మహిపాల్ ఇల్లంతకుంట డాక్టర్ జీవనజ్యోతి PHN సూపర్వేజర్లు తార బాయి శోభ రాణి MLHP లు ప్రత్యుష సంధ్యారాణి ANM లు జయ దేవకీ ఆశలు పద్మ మమత బృందం తదితరులు పాల్గొన్నారు



## అప్పుడే ఓటీటీలోకి రోషన్-శ్రీదేవిల 'బ్యాండు మేళం'.. స్ట్రీమింగ్ పై అధికారిక ప్రకటన

కోర్ట్ మూవీతో సెన్సేషన్ క్రియేట్ చేసిన హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'బ్యాండ్ మేళం'. బావా మరదళ్ల ప్రేమ కథా చిత్రంగా తెరకెక్కిన ఈ మూవీ గత నెలలోనే థియేటర్లలో విడుదలైంది. ఇప్పుడీ యూత్ ఫుల్ లవ్ ఎంటర్ టైనర్ ఓటీటీలోకి రాబోతుంది. ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ డేట్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. 'కోర్టు' సినిమాతో హిట్ పెయిర్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు రోషన్-శ్రీదేవి. ఈ సినిమా తర్వాత సోషల్ మీడియాలోనూ ఈ జోడీకి ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగిపోయింది. ఇద్దరూ కలిసి పలు షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ కు కూడా హాజరయ్యారీ జంట. ఈ క్రమంలోనే రోషన్- శ్రీదేవిని హీరో, హీరోయిన్లుగా పెట్టి తీసిన మరో సినిమా 'బ్యాండు మేళం'. సతీశ్ జివ్వాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ రచయిత కోన వెంకట్ నిర్మించడం విశేషం. తెలంగాణలోని పల్లెటూరి బ్యాక్‌డ్రాప్‌లో బావామరదళ్ల మధ్య జరిగే స్టోరీతో ఈ సినిమాను తెరకెక్కించారు. సినిమా విడుదలకు ముందు ప్రమోషన్లు కూడా గట్టిగానే నిర్వహించారు. పాటలు, గ్లింప్స్ కూడా ఆకట్టుకున్నాయి. అయితే మార్చి 26న థియేటర్లలో విడుదలైన బ్యాండ్ మేళం సినిమాకు మిక్స్ డ్ రెస్పాన్స్ వచ్చింది. రోషన్-శ్రీదేవిల జంట కెమిస్ట్రీ ఆకట్టుకున్నా కథ, కథనాలు మరీ నాసిరకంగా ఉన్నాయన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో థియేటర్లలో రిలీజైన నెలలో బ్యాండ్ మేళం ఓటీటీలోకి వచ్చేస్తోంది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020